సాక్షి సంగారెడ్డి

బుధవారం, 31, మే, 2023



లారీల అడ్డగింత

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జోగిపేటలో రైతులు లారీలను అడ్డుకున్నారు. 8లో..



పేలిన సిలిండర్

ప్రమాదవశాత్తు వంటగ్యాస్ సిలిండర్ పేలి రెండు ఇళ్లు కాలిపోయిన ఘటన నారాయణఖేడ్ నియోజకవర్గం నిజాంపేట మండలంలో జరిగింది. 8లో..

13న సదరం శిబిరం

సంగారెడ్డి మున్సిపాలిటీ: ప్రతీనెల నిర్వహించే సదరం శిబిరాన్ని జూన్ 13వ తేదీన నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యాధికారి గాయత్రి దేవి మంగళవారం తెలిపారు. ఇందుకు సంబంధించిన స్లాట్స్ జూన్ 6వ తేదీన కేటాయిస్తామన్నారు. సంబంధిత వ్యక్తులు ముందుగా స్లాట్ బుక్ చేసుకొని శిబిరానికి హాజరుకావాలని సూచించారు.

మృగశిర ముంచుకొస్తున్నా..

- కేంద్రాల్లోనే ధాన్యం
- మిర్గమ నుంచే ఖరీఫ్ పనుల్లో రైతులు బిజీ
- సగం కూడా పూర్తికాని ధాన్యం సేకరణ
- ఆందోళనతో రోడ్డెక్కుతున్న రైతులు



సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: ఖరీఫ్ సీజన్ దగ్గర పడుతున్నప్పటికీ ధాన్యం కొనుగోళ్లు ముందుకు సాగడం లేదు. జిల్లాలో ధాన్యం కోతలు ప్రారంభమై రెండు నెలలు దగ్గర పడుతున్నప్పటికీ కనీసం సగం ధాన్యం కూడా సేకరణ జరగలేదు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కుప్పలు ఎక్కడికక్కడ ఉండిపోయాయి. ఈ కుప్పలపై టార్పాలిన్‌లు కప్పుకుని ఎప్పుడెప్పుడు కొనుగోలు చేస్తారా అని రైతులు వారాల తరబడి పడిగాపులు కాస్తున్నారు. ఈ క్రమంలో ఓపిక నశిస్తున్న రైతులు ఆందోళనకు దిగుతున్నారు. మంగళవారం జోగిపేట్, గుమ్మడిదల మండలాల్లో రైతులు రాస్తారోకోలు నిర్వహించారు.

- జిల్లాలో ఈ యాసంగి కొనుగోలు సీజనులో 2.03 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకు కేవలం 96 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేయగలిగారు.
- ధాన్యం సేకరణ సీజను ప్రారంభమై సుమారు రెండు నెలలు దగ్గర పడుతోంది. ఇంకా పక్షం రోజుల్లో మిగిలిన సగం సుమారు లక్షకు పైగా ధాన్యం కొనుగోళ్లు చేయడం అనేది ప్రశ్నార్థకంగా మారింది.

ఖరీఫ్ పనులెలా చేసుకునేది?

- రైతులు ఏటా మృగశిర కార్తె నుంచి ఖరీఫ్ పనుల్లో బిజీ అవుతారు. జూన్ మొదటి వారం తర్వాత వాతావరణం చల్లబడిన వెంటనే దుక్కులు దున్నుకోవడం తదితర పనులు ప్రారంభిస్తారు.
- ఎరువులు, విత్తనాల సేకరణల్లో నిమగ్నమవుతుంటారు. మరో ఎనిమిది రోజుల్లో మృగశిర కార్తె రానుంది. యాసంగి ధాన్యం ఇంకా కొనుగోలు కేంద్రాల్లోనే ఉండిపోవడంతో రైతులు కేంద్రాల వద్దే పడిగాపులు కాస్తున్నారు.
- దీంతో ధాన్యం ఎప్పుడు విక్రయించాలి, ఎప్పుడు ఖరీఫ్ పనులు చేసుకోవాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో ఓపిక నశిస్తున్న రైతులు రాస్తారోకోలకు దిగుతున్నారు.

మిల్లర్లతోనే సమస్య

- రైసు మిల్లర్లతోనే ప్రధానంగా సమస్య తలెత్తుతోంది. కొనుగోలు కేంద్రాల నుంచి వెళ్లిన లారీలను వెంట వెంటనే దించుకోకపోవడంతో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు కేంద్రాల నుంచి ధాన్యాన్ని రవాణా చేయడం లేదు.
- దీంతో రైతులకు వారాల తరబడి పడిగాపులు తప్పడం లేదు. ఒక్కో మిల్లు వద్ద ధాన్యం లారీలు వారం రోజులకు పైగా దిగుమతి కాకుండా నిలిచిపోవడంతో రవాణా ఇబ్బందిగా మారుతోంది.

తక్కువ మిల్లులు

- జిల్లాలో సుమారు 68 రైసుమిల్లులు ఉన్నాయి. ఇందులో 20 బాయిల్డ్ రైస్‌మిల్లులు కాగా, మిగిలినవి రారైస్ మిల్లులే. యాసంగిలో పండే ధాన్యాన్ని కేవలం బాయిల్డ్ రైసుమిల్లులకు మాత్రమే అలాట్ మెంట్ చేయాల్సి ఉంటుంది.
- దీంతో ఈ యాసంగి సీజనులో కొనుగోలు చేసిన ధాన్యమంతా ఈ 20 బాయిల్డ్ మిల్లులకే తరలించాల్సి వస్తోంది. ఈ మిల్లర్లు వెంట వెంటనే ధాన్యం దించుకోకపోవడంతో సమస్య తలెత్తుతోంది.
- ఒకవైపు క్వింటాల్‌కు ఏడు, ఎనిమిది కిలోలు తరుగు దోపిడీ చేస్తున్న మిల్లర్లు ధాన్యం దించుకోకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది.

గోదాముల్లో నిల్వ చేయాలని ఆదేశించినా..

- రైసుమిల్లర్లు ధాన్యం దించుకోవడంలో ఇబ్బందులు తలెత్తితే ఓ గోదాములు లీజుకు తీసుకుని ధాన్యాన్ని గోదాములకు తరలించాలని ప్రభుత్వం ఆదేశించింది.
- కానీ జిల్లా అధికార యంత్రాంగం ఈ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు. దీంతో సమస్య రోజురోజుకు జఠిలమవుతోంది.

అమ్మిన రైతులకు అందని ధాన్యం డబ్బులు

- ఓ వైపు ధాన్యం కొనుగోళ్ల కోసం రైతులు పడిగాపులు కాస్తుంటే, మరోవైపు కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి కూడా డబ్బులు అందడంలోనూ రైతులకు ఎదురు చూపులు తప్పడం లేదు.
- జిల్లాలో ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి రూ.199.79 కోట్లు రైతులకు చెల్లించాల్సి ఉండగా, ఇప్పటి వరకు కేవలం రూ.55.73 కోట్లు మాత్రమే రైతుల ఖాతాల్లో జమ అయ్యాయి.
- ఇంకా సుమారు రూ.144.06 కోట్లు రైతులకు రావాల్సి ఉంది. ఈ ధాన్యం డబ్బులు సకాలంలో అందితే రైతులు ఖరీఫ్ సాగు ఖర్చులకు ఉపయోగపడేవి. కానీ, జాప్యం జరుగుతుండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

న్యూస్‌రీల్

వడ్ల కొనుగోలులో తరుగును సర్కార్ భరించాలి

- బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ గౌడ్



మాట్లాడుతున్న బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ గౌడ్

పటాన్‌చెరు టౌన్: వడ్ల కొనుగోలులో తరుగును రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని, నగదును సంబంధిత రైతుల ఖాతాలో వెంటనే జమ చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం పటాన్‌చెరు మండలం ముత్తంగిలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఇటీవల కురిసిన వర్షాలకు ధాన్యం తడిసి రైతులు నష్టపోయారని, ఎండిన వడ్లు తీసుకుని కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు చేసిన వారికి సకాలంలో నగదు ఇవ్వలేడంలేదని, దీనికి తోడు తరుగు భారం కూడా రైతులపై వేయడం సరికాదన్నారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడు దేవేందర్ గౌడ్, భారతీ నగర్ డివిజన్ అధ్యక్షుడు మన్నే శ్రీకాంత్, జిల్లా కిసాన్ మోర్చా నాయకులు వీరారెడ్డి, బీజేవైయం అసెంబ్లీ కన్వీనర్ రాజ్ గోపాల్ యాదవ్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు జోగు ధన్‌రాజ్, సోషల్ మీడియా కన్వీనర్ సంగమేష్, రమణ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యకార్మిక ఉద్యమాలకు సారథి సీఐటీయూ

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జీరం మల్లేశం



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జీరం మల్లేశం

కొండాపూర్(సంగారెడ్డి): భారతదేశంలో ఐక్య కార్మిక ఉద్యమాల సారథి సీఐటీయూ అని, ఆ సంఘం వ్యవస్థాపకుల ఆశయాలను నెరవేరుస్తామని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి మల్లేశం అన్నారు. మంగళవారం సీఐటీయూ 53వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని సుందరయ్య భవన్ దగ్గర సీఐటీయూ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడారు. 1970లో సీఐటీయూని బీటీ రణదీవే, పి.రామ్మూర్తి ఏర్పాటు చేశారన్నారు. ఆనాటి నుంచి కార్మికులకు, కర్షకులకు అండగా ఉంటూ వారి సంక్షేమానికి ఎన్నో పోరాటాలు చేస్తూ వ్యవస్థాపకుల ఆశయాలను కొనసాగిస్తున్నామన్నారు. కేంద్రం 44 చట్టాలను నాలుగుకోడ్‌లుగా విభజించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్చిన కార్మిక చట్టాల కోసం మరో పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కార్మికులకు కనీస వేతనాలు అమలు కావడం లేదని, కేటగిరీల వారీగా వేతనాలు కూడా అమలు చేయకుండా కార్మికులను పట్ల వివక్ష గురి చేస్తున్నారని వాపోయారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు, నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



వినతి పత్రం అందజేస్తున్న టీఎస్ హెచ్‌డీసీ చైర్మన్ చింతా ప్రభాకర్

సంగారెడ్డిటౌన్: కలెక్టర్ శరత్‌ను టీఎస్ హెచ్‌డీసీ చైర్మన్ చింతా ప్రభాకర్ మంగళవారం కలిశారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు. సమస్యలపై కలెక్టర్ తో చర్చించారు. కుల సంఘాల జిల్లా ఆత్మగౌరవ భావనలకు స్థలం కేటాయించాలన్నారు. కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ విజేందర్ రెడ్డి, బీఆర్ఎస్, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రుణాల మంజూరులో ప్రథమస్థానం



అవార్డు అందుకుంటున్న డీసీసీ బ్యాంక్ చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి

- లాభాల్లో ద్వితీయ స్థానం
- అవార్డు అందుకున్న డీసీసీబీ చైర్మన్, సీఈఓ
- రూ.400 నుంచి 2 వేల కోట్లు టర్నోవర్

సంగారెడ్డి మున్సిపాలిటీ: ఖాతాదారులకు రుణాలు మంజూరు చేయడంలో ఉమ్మడి మెదక్ డీసీసీబీ రాష్ట్ర స్థాయి అవార్డు అందుకుంది. స్టేట్ సెల్ఫ్ హెల్ప్ (ఎస్‌ఎచ్‌జి) గ్రూపులకు రుణాలు అందించడంలో రాష్టంలో ప్రథమ స్థానంలో నిలిచింది. లాభాల్లో రెండవ స్థానం దక్కించుకుంది. ఇందుకుగాను మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన సదస్సులో పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు చేతులమీదుగా బ్యాంకు చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి, సీఈఓ శ్రీనివాస్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా సంగారెడ్డిలో బ్యాంక్ చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. రుణాల అందించడంలో మెదక్ డీసీసీబీ ప్రథమ స్థానంలో ఉందన్నారు. రాష్టస్థాయిలో లాభాల బాటలో కరీంనగర్ మొదటి, మెదక్ రెండో స్థానంలో నిలిచాయన్నారు. రూ.400 కోట్ల నుంచి రూ.2.10 కోట్లకు చేరిందన్నారు. రుణాల రికవరీలోనూ 98 శాతం ఉందన్నారు. తమ బ్యాంకును చూసి ఇతర బ్యాంకులు పోటీపడుతూ రుణాల అందించేందుకు ముందుకు వస్తున్నాయన్నారు. మహిళలకు రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు కట్టుకునే ఇళ్లకు రూ.10 లక్షలు, మండల కేంద్రాల్లో రూ.20 లక్షలు, మున్సిపాలిటీల్లో రూ.50 లక్షల వరకు రుణాలు అందిస్తున్నామన్నారు. 2022–23కు గాను మహిళా గ్రూపులకు రూ.393.56 కోట్ల రుణాలు, 15 వేల గ్రూపులకు 1.50 లక్షల మందికి రుణాలతో లబ్ధి చేకూరిందని తెలిపారు. వ్యక్తిగతంగా కూడా రూ.2 లక్షల నుంచి 5 లక్షల వరకు రుణాలు అందిస్తున్నామన్నారు. విదేశాల్లో చదువుకునేందుకు రైతుల పిల్లలకు రూ.20 లక్షల చొప్పున రూ.5 కోట్ల రుణాలు ఇచ్చామన్నారు. రూ.3 లక్షల వరకు 7 శాతం వడ్డీ, రూ.5 లక్షల వరకు 9 ఆపై 11 శాతంతో రుణాల అందిస్తున్న ఘనత డీసీసీబీకే దక్కుతుందన్నారు. రూ.12.82 కోట్ల లాభాలతో రెండో స్థానంలో నిలిచామంటే అందుకు బ్యాంక్ ఉద్యోగులు, సిబ్బంది శ్రమ ఉందన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్ రావుకు, బ్యాంక్ ఖాతాదారులకు కతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో బ్యాంకు సీఈవో శ్రీనివాస్, మేనేజర్ సంగమేశ్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

గీతం రీసెర్చ్ స్కాలర్‌కు డాక్టరేట్



మహమ్మద్ అబ్దుల్

పటాన్‌చెరు టౌన్: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వైఫల్యంపై విశ్లేషణ, దానిపై సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించిన హైదరాబాద్(రుద్రారం) గీతం డీమ్డ్ విశ్వ విద్యాలయంలోని ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగం పరిశోధక విద్యార్థి (రీసెర్చ్ స్కాలర్) మహమ్మద్ అబ్దుల్ రెహ్మాన్‌ను డాక్టరేట్ వరించింది. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ అసోసియేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్.సీతారామయ్య, సహ పర్యవేక్షకుడు ప్రొఫెసర్ బి.బస్వరాజు మంగళవారం వెల్లడించారు. అబ్దుల్ రెహ్మాన్ సమర్పించిన సిద్ధాంత వ్యాసం పీహెచ్‌డీ పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం విశ్వవిద్యాలయం, హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీఎస్ రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్‌ఆర్ వర్మ అభినందించారు.

చెట్లకు జియో ట్యాగ్

గీతం హైదరాబాద్ ప్రాంగణంలోని చెట్లు, మొక్క లు, పొదలు, తీగ జాతులకు మంగళవారం జియో–ట్యాగ్ చేశారు. వాటికి అమర్చిన క్యూ–ఆర్ కోడ్ను స్కాన్ చేయడం ద్వారా ఆయా మొక్కల వృక్షశాస్త్ర, సాధారణ పేర్ల వివరాలతో పాటు వాటి వర్గీకరణ, పుష్ప లేదా ఫలాల వివరాన్నీ లభిస్తాయి. గీతం మూడు ప్రాంగణాలలోని చెట్ల జాతులకు క్యూఆర్ కోడ్లను ట్యాగ్ చేస్తున్నట్లు గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్, విశాఖపట్నం సీనియర్ ప్రొఫెసర్ కె.మోహన్ తెలియజేశారు. కార్యక్రమంలో రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్, హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ సునీల్ కుమార్, ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జీ.ఎస్.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డీసీహెచ్ఎస్‌ను తరలించొద్దు



మాట్లాడుతున్న కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం

కొండాపూర్(సంగారెడ్డి): వైద్య విధాన పరిషత్ (డీసీహెచ్ఎస్) జిల్లా కార్యాలయాన్ని ఇతర ప్రాంతాలకు తరలించాలనే ఆలోచన విరమించుకోవాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని కేవీపీఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలో ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి ఉండేదని, సంగారెడ్డికి మెడికల్ కాలేజ్ మంజూరైన తర్వాత జిల్లా ఆస్పత్రినే మెడికల్ కాలేజీగా మార్చారన్నారు. జిల్లా ఆస్పత్రిలో పనిచేసిన 300 మంది ప్రస్తుతం జిల్లా ఆస్పత్రిలోనే విధులు నిర్వహిస్తున్నారన్నారు. ప్రస్తుతం డీసీహెచ్ఎస్ కార్యాలయం జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ కార్యాలయంలోనే కొనసాగుతుందని, కానీ జనరల్ హాస్పిటల్ సిబ్బందికి రూములు సరిపోవడంలేదని డీసీహెచ్ఎస్ ఆఫీస్ ఇక్కడి నుంచి ఖాళీ చేయాలని అధికారులు అంటున్నారన్నారు. దీంతో జోగిపేట, పటాన్‌చెరువు, సదాశివపేటలో ఎక్కడికైనా కార్యాలయాన్ని మార్చాలని అధికారులు ప్రయత్నిస్తున్నారని, ఇది ఉద్యోగులకు, ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా ఉందన్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రి ఆవరణంలోనే డీసీహెచ్ఎస్, డీఎంహెచ్ఓ, జనరల్ ఆస్పత్రిని కలిపి ఒకే దగ్గర ఇంటిగ్రేటెడ్ కార్యాలయంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. డీసీహెచ్ఎస్ జిల్లా కార్యాలయాన్ని తరలిస్తే ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి ప్రవీణ్, జిల్లా కమిటీ సభ్యుడు దాస్, నాయకులు పాల్గొన్నారు.

త్వరలో పోలీస్‌స్టేషన్ ప్రారంభిస్తాం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఉస్మాన్‌నగర్‌లో తాత్కాలికంగా ఏర్పాటు చేస్తున్న కొల్లూర్ పోలీస్‌స్టేషన్ భవనాన్ని మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పనులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నూతన పోలీస్‌సేషన్ భవనం ఏర్పాటయ్యే వరకు తాత్కాలిక ఉస్మాన్‌నగర్ పోలీస్‌స్టేషన్ కేంద్రంగా కార్యకలాపాలు కొనసాగుతాయన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ సంజయ్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు వెంకట్ రెడ్డి, ఉమేష్, రవీందర్ రెడ్డి, శ్రీధర్, ఏఈ సంజయ్ పాల్గొన్నారు.

ఉద్యమకారుడికి పరామర్శ



శ్రీనివాస్‌కు నివాళులర్పిస్తున్న కోదండరాం


కోహీర్(జహీరాబాద్): ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న ఉద్యమ కారుడు, తెలంగాణ విద్యుత్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అదనపు కార్యదర్శి ప్రశాంత్ ఇంటికి మంగళవారం టీజేఎస్ అధ్యక్షుడు, ప్రొఫెసర్ కోదండరాం వెళ్లారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ప్రశాంత్‌ను పరామర్శించారు. ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రశాంత్ మలిదశ ఉద్యమంలో విద్యుత్ ఉద్యోగులను ఏకం చేయడంతో పాటు ప్రత్యేక రాష్ట్రం వచ్చేంత వరకు చెప్పులను ధరించకుండా తిరిగాడు. ప్రశాంత్ సోదరుడు శ్రీనివాస్ ఇటీవల అకాల మరణం చెందడంతో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు తుల్జారెడ్డి, నాయకులు మాణిక్‌రెడ్డి, శ్రీధర్ పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగ అవకాశాలు

సంగారెడ్డి టౌన్ : హెచ్‌సీఎల్ టెక్ బి ఆధ్వర్యంలో ఉద్యోగ అవకాశాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఆర్.గోవింద రామ్ తెలిపారు. జూన్ 1న జాబ్ డ్రైవ్‌ను సంగారెడ్డిలోని ఎస్‌వి జూనియర్ కాలేజీలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 75 శాతంతో ఎంపీసీ, ఎంఈసీ పూర్తి చేసిన అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకొని ఎంపిక ప్రక్రియలో పాల్గొన్నారన్నారు హెచ్‌సీఎల్ ప్రోగ్రామ్‌కు దరఖాస్తు చేసుకునేందుకు అభ్యర్థి ఇంటర్మీడియట్ 2022–23లో పూర్తిచేసి ఉండాలన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్నవారికి హెచ్‌సీఎల్ టెక్నాలజీస్‌లో పూర్తికాల ఉద్యోగులుగా నియమించుకుంటారని తెలిపారు. కోర్సులో భాగంగా ఇంటర్న్‌షిప్ చేసేటప్పుడు అభ్యర్థికి నెలకు రూ.10 వేల చొప్పున స్టయిఫండ్ చెల్లిస్తారన్నారు. పూర్తిస్థాయి ఉద్యోగిగా ఎంపికైతే ప్రారంభ వార్షిక వేతనం 1.70 లక్షల నుంచి రూ.2.20 లక్షల వరకు చెల్లిస్తారని తెలిపారు. హెచ్‌సీఎల్‌లో ఉద్యోగం చేస్తూనే ఉన్నత విద్య చదువుకునే అవకాశం వుందన్నారు. మరిన్ని వివరాలకు https://bit.ly/HCLTB&Telangana లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు హెచ్‌సీఎల్ ఏరియా ప్రతినిధి రాఘువేంద్రను 9063564875, 9014600354 ఫోన్ నంబర్‌లలో సంప్రదించాలని సూచించారు.

రైతుబీమాతో భరోసా

- 2018 ఆగష్టు 14న ప్రారంభం
- రూ.5 లక్షల చొప్పున మంజూరు
- 18 నుంచి 59 ఏళ్లలోపు వారు అర్హులు
- జిల్లాలో ఇప్పటి వరకు 6,158 మంది లబ్ధి



కంకోల్‌లో రైతుల నుంచి వివరాలు సేకరిస్తున్న ఎఈఓ లావణ్య (ఫైల్)

మునిపల్లి(అందోల్): కుటుంబానికి పెద్దదిక్కుగా ఉండే రైతు అకాల మరణం చెందితే ఆ కుటుంబ సభ్యులు ఆర్థికంగా ఇబ్బందులు పడతారు. వారి కుటుంబాలకు భరోసా కల్పించేందుకు 2018 ఆగష్టు 14వ తేదీన ప్రభుత్వం రైతుబీమా పథకానికి శ్రీ కారం చుట్టింది. జీవిత బీమా సంస్థతో కలిసి ప్రవేశ పెట్టిన ఈ పథకం అన్నదాత కుటుంబాలకు అండగా నిలుస్తోంది. రైతుల పక్షాన ప్రీమియాన్ని ప్రతీ సంవత్సరం ప్రభుత్వమే చెల్లిస్తోంది. బీమా ఉన్న రైతు ఏ కారణంతోనైనా మృతి చెందినా నామినీకి రూ.5 లక్షలు బీమా సంస్థలు లబ్ధిదారుల ఖాతాలలో డబ్బులను జమ చేస్తుంది.

- గుంటా భూమి ఉన్న బీమా వర్తింపు.
- ఆధార్ కార్డులో 18–59 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న వారు ఈ పథకానికి అర్హులు. కనీసం గుంట భూమి ఆపై ఎంత విస్తీర్ణం ఉన్నప్పటికీ లబ్ధిదారులుగా ఉండొచ్చు.
- దరఖాస్తు పత్రంతో పాటు రైతు పట్టదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు ఉన్న రైతుల వివరాలను బీమా పోర్టల్‌లో నిక్షిప్తం చేస్తారు.
- బీమా పత్రం పొందిన రైతులు ఏదైనా కారణాలతో మృతి చెందితే సదరు రైతు మరణం మరణ ధ్రువీకరణ పత్రం సమర్పించిన రైతు రెండు నెలలలోపు రూ.5 లక్షల పరిహారం నామినీ బ్యాంకు ఖాతాలో జమ చేస్తున్నారు.
- జిల్లాలో ఇప్పటి వరకు 6.158 మందికి బీమా వర్తింపు
- సంగారెడ్డి జిల్లాలో రైతు బీమా ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు వివిధ కారణాలతో సుమారు 6,158 మంది లబ్ధిదారులకు బీమా మంజూరు చేసినట్లు సంబంధిత అధికారుల లెక్కలు చెబుతున్నాయి.

రైతు కుటుంబాలకు భరోసా



ఏ కారణంతోనైనా రైతు మృతి చెందితే రైతు బీమా పథకం ద్వారా ఆ కుటుంబానికి రూ.5 లక్షల పరిహారంతో భరోసా కలుగుతుంది. ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు బీమా, రైతుబంధు పథకాలు రైతులకు ఉపయోగంగా మారాయి. భూమి ఉన్న ప్రతీ రైతు రైతు బీమా, రైతుబంధు పథకం మంజూరు కోసం దరఖాస్తు చేసుకోవాలి.

– సాయికుమార్, ఖమ్మంపల్లి

పరిహారం మంజూరు



రైతుబంధు పథకం మంజూరుకు భూమి ఉన్న రైతు మృతి చెందిన వారికి రైతు బీమా పథకం డబ్బులు మంజూరు అవుతున్నాయి. వివిధ కారణాలతో మృతి చెందిన 90 శాతం మంది రైతులకు రైతుబీమా ప్రభుత్వం మంజూరు చేస్తుంది. మరణ ధ్రువీకరణ పత్రం జతచేసి పరిహారం కోసం దరఖాస్తు చేసుకోవాలి. రెండు నెలల లోపు నామిని ఖాతాలో జమ అవుతాయి.

– పెంటాగౌడ్ , పిల్లోడి

సత్వరమే చెల్లింపు



బీమా కలిగి ఉన్న రైతులు మృతి చెందితే మరణ ధ్రువీకరణ పత్రం అందించిన రెండు నెలల లోపు నామినీల బ్యాంకు ఖాతాలో జమవుతాయి. ఇప్పటి వరకు 6,158 మంది లబ్ధిదారుల ఖాతాలో జమ చేయడం జరిగింది. కొత్త పట్టాదారు పాసు పుస్తకం పొందిన ప్రతీ రైతు తమ ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్, నామినీ బ్యాంకు పాస్‌బుక్ సంబంధిత అధికారులకు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ అవకాశాన్ని భూమి ఉన్న రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– నర్సింగ్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి

క్లుప్తంగా

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

హుస్నాబాద్‌రూరల్: పల్లె ప్రజలు చట్టాలపై అవగహన పెంచుకోవాలని ఎస్‌ఐ మహేశ్ అన్నారు. మంగళవారం పోతారం(ఎస్)లో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు అందరు కలిసి కట్టుగా అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బత్తిని సాయిలు, ఎంపీటీసీ బొమ్మగాని శ్రీనివాస్, కార్యదర్శి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ టోర్నీలో సెంచరీలు

సిద్దిపేట ఎడ్యుకేషన్: సీఎం కేసీఆర్ టోర్నీలో భాగంగా సోమవారం సాయంత్రం సిద్దిపేటలో నిర్వహించిన పోటీల్లో అరుదైన రికార్డ్ నమోదైంది. పట్టణంలోని మినీ స్టేడియంలో జరుగుతున్న క్రికెట్ పోటీల్లో టీహెచ్‌ఆర్ జట్టు సభ్యుడైన సాయినాథ్ 32 బంతుల్లో సెంచరీ బాదాడు. ఇందులో 11 ఫోర్లు, 6 సిక్స్‌లు ఉన్నాయి. టీహెచ్‌ఆర్ జట్టు మొత్తం 145 రన్స్ చేసి విజయం సాధించింది. మంగళవారం నిర్వహించిన పోటీల్లో అంబేడ్కర్ ఆజాద్ జట్టు సభ్యుడు అఫ్రిది 44బంతుల్లో 138 రన్స్ చేశాడు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి జరిమానా విధిస్తూ సిద్దిపేట కోర్టు తీర్పునిచ్చింది. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం..పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా, అంబేడ్కర్ చౌరస్తా, బీజేఆర్ చౌరస్తాల్లో తమ సిబ్బందితో కలిసి వారం రోజుల క్రితం వాహనాల తనిఖీ నిర్వహించగా 24 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని మంగళవారం సిద్దిపేట కోర్టులో హాజరుపరచగా విచారణ జరిపిన న్యాయమూర్తి వారికి రూ.45వేల జరిమానా, ఒకరికి జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చినట్లు సీఐ తెలిపారు.

14 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్ లో పట్టుబడిన 14 మంది మద్యం తాగినవారికి కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌రెడ్డి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఆది, సోమవారాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 14 మంది పట్టుబడ్డారు. వారిని మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి 12 మందికి ఒకొక్కరికి రూ.2 వేల చొప్పున, మరో వ్యక్తికి రూ.3 వేలు, ఇంకో వ్యక్తికి రూ.5 వేలు జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం

చేర్యాల(సిద్దిపేట): కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు దాసరి కళా వతి కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. మంగళ వారం సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సీఐటీయూ జెండాలను ఆవిష్కరించారు. యాదగిరి, సంతోశ్, వెంకటవ్వ, కనుకవ్వ, కాజా పాల్గొన్నారు.

సిద్దిపేటరూరల్: సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నారాయణరావుపేట మండల కేంద్రంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తునికి మహేశ్ జెండా ఆవిష్కరించారు. ఆయనతో మహంకాళి నర్సింలు, యదరాయమల్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ఫోన్ గొడవ

విద్యార్థిని ఆత్మహత్య

కల్హేర్(నారాయణఖేడ్): ఫోన్ గొడవ విద్యార్థిని ప్రాణం బలితీసుకుంది. కల్హేర్ మండలం మార్డిలో మంగళవారం ఈ సంఘటన జరిగింది. గ్రామానికి చెందిన ఓ విద్యార్థిని(11) ఆమె సోదరుడు మధ్య ఫోన్ చూసేందుకు గొడవ పడ్డారు. మనస్తాపం చెందిన విద్యార్థిని మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ సమయంలో ఆత్మహత్య చేసుకుందని స్థానికులు తెలిపారు. విద్యార్థిని 6వ తరగతి చదువుతోంది. ఈ ఘటనతో గ్రామంలో విషాదం నెలకొంది. రాత్రి అంత్యక్రియలు చేశారు. ఈ విషయంపై కుటుంబీకులు వివరాలు వెల్లడించలేదు.

లారీల అడ్డగింత

- జోగిపేట జాతీయ రహదారిపై రైతుల రాస్తారోకో
- కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించాలని డిమాండ్
- అందోల్, పోసానిపేటలో వేర్వేరుగా నిరసన
- రోడ్డుపై ధాన్యం తగలబెట్టిన అందోల్ రైతులు



జోగిపేటలో జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు



లారీని అడ్డుకుంటున్న రైతులు

జోగిపేట (అందోల్): కేంద్రాలలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించడంతో జోగిపేటలో రోడ్డుపై వెళ్తున్న లారీలను రైతులు అడ్డుకున్నారు. మంగళవారం అందోల్ సొసైటీ కార్యాలయం వద్ద, జోగిపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతులు వేర్వేరుగా జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. సుమారుగా గంటకుపైగా బైఠాయించడంతో ఇరువైపు వాహనాలు ఎక్కడికక్కడ నిలిచి పోయాయి. కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని తూకం వేయడం లేదని, తూకం వేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని వారు ఆరోపించారు. ధాన్యం తూకం వేసి పది రోజులకు పైగా గడుస్తున్నప్పటికీ, రైస్ మిల్లులకు తరలిచకపోవడంతో, కేంద్రాల వద్ద ధాన్యానికి రేయింబవళ్లు కాపలాగా ఉండాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వ నిబంధనల విరుద్ధంగా బస్తాకు 2.50 కిలోల తరుగును తీస్తున్నారని ఆరోపించారు. అలాగే రైస్ మిల్లర్లు లారీకి 4 నుంచి 5 క్వింటాళ్ల ధాన్యాన్ని తరుగు విధిస్తున్నారని తెలిపారు.

అందోల్‌లో ధాన్యం తగులబెట్టి..

ధాన్యం కొనుగోలు జాప్యంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యాన్ని జాతీయ రహదారిపై తగలబెట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న జోగిపేట ఎస్‌ఐ సామ్యానాయక్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని రైతులకు నచ్చజేప్పే ప్రయత్నం చేశారు. ఫోన్‌లో తహసీల్దార్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

లారీలు అడ్డుకొని..

అందోల్ మండల పరిధిలోని పోసానిపేటకు చెందిన రైతులు జోగిపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. రహదారిపై వస్తున్న రెండు లారీలను అడ్డుకున్నారు. ఈ లారీలను తమ గ్రామానికి పంపించాలని, తమ ధాన్యాన్ని రైస్ మిల్లుకు పంపిస్తామని, అక్కడే ఉన్న తహసీల్దార్ వెంకటేశం, ఉప తహసీల్దార్ మధుకర్‌రెడ్డి, ఎస్‌ఐ సామ్యానాయక్‌ను కోరారు. లారీలో రైతులు కూర్చొని తమ గ్రామానికి రావాలని డ్రైవర్‌ను అడుగగా వారి మధ్య వాగ్వావాదం జరిగింది. అధికారులు డ్రైవర్‌కు నచ్చజెప్పి, లారీ ఓనర్‌ను పిలిపించి మాట్లాడారు. లారీకి కిరాయిని తాము చెల్లిస్తామని, ఓనర్‌కు నచ్చజేప్పడంతో లారీని పంపించేందుకు అంగీకరించాడు. లోడ్‌ను రైస్ మిల్లర్లు అన్‌లోడ్ చేయకపోవడంతో సమస్య వస్తుందని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తహసీల్దార్ వెంకటేశం తెలిపారు.

ధాన్యం కొనుగోలు చేయాలని..

జిన్నారం(పటాన్‌చెరు): కొనుగోలు కేంద్రాల వద్ద నిల్వ ఉంచిన ధాన్యాన్ని మిల్లులకు పంపటం లేదని ఆరోపిస్తూ రైతులు ధర్నాకు దిగారు. గుమ్మడిదల గ్రామంలోని ప్రధాన రహదారిపై ఉన్న టోల్ ప్లాజా వద్ద రైతులు ఆందోళన చేపట్టారు. రైతులు చేపట్టిన ధర్నాకు కాంగ్రెస్ నేతలు మద్దతు పలికారు. రెండు గంటల పాటు ధర్నా చేయటంతో ట్రాఫిక్ స్తంభించింది. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ నెల రోజులుగా కేంద్రాల వద్ద ఉన్న ధాన్యంను మిల్లులకు తరలించటం లేదన్నారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవటం లేదని ఆరోపించారు. ధాన్యం తరుగు విషయంలో కూడా అధికారులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారన్నారు. ధాన్యాన్ని తక్షణమే మిల్లులకు తరలించాలని రైతులు డిమాండ్ చేశారు. అధికారులు సముదాయించడంతో శాంతించారు.

రైతు సమస్యలను గాలికొదిలేసిన ప్రభుత్వం

దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

దుబ్బాకటౌన్: ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు పరిష్కరించకుండా ప్రభుత్వం రైతుల సమస్యలను గాలికొదిలేసిందని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు ఆరోపించారు. మంగళవారం దుబ్బాక మార్కెట్ యార్డును సందర్శించి రైతులతో మాట్లాడారు. వానకాలం ప్రారంభమై వర్షాలు పడుతున్నా ఇంకా కొనుగోళ్లు పూర్తి కాకపోవడంపై మండిపడ్డారు. పెద్ద ఎత్తున ధాన్యం కుప్పలు కేంద్రంలో ఉండడంపై వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు, కలెక్టర్‌కు ఫోన్ చేసి వివరాలు కనుక్కున్నారు. ధాన్యం త్వరగా మిల్లులకు తరలించాలని సూచించారు. వానలు పడి కేంద్రాల్లో ధాన్యం తడిచి రైతులు ఇబ్బందులు పడుతుంటూ సీఎం కేసీఆర్ హైదరాబాద్‌లో కూర్చొని సమీక్షలు నిర్వహించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, రైతులు తదితరులు ఉన్నారు.

దొంగతనానికి వచ్చి..

బావిలో పడి యువకుడి మృతి



బాబ్య (ఫైల్)

రామాయంపేట(మెదక్): వైన్‌షాపు పర్మిట్ రూంలో దొంగతనానికి వచ్చిన అన్నదమ్ములు పారిపోతుండగా ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. మృతుడి సోదరుడు మోహన్ కథనం మేరకు.. హవేళీ ఘన్‌పూర్ మండలం కొచ్చెరువు తండాకు చెందిన మూడావత్ బాబ్య (28) గతంలో పలు చోరీల్లో నిందితుడుగా ఉన్నాడు. సోదరుడు మోహన్‌తో కలిసి స్థానికంగా ఉన్న వెంకటేశ్వర వైన్స్ పర్మిట్ రూంలో గత శనివారం రాత్రి చోరీకి పాల్పడ్డాడు. ఇంతలో పోలీస్ వాహనం సైరన్ విని పారిపోతుండగా బాబ్య ప్రమాదవశాత్తు పర్మిట్ రూం పక్కనే ఉన్న బావిలో పడిపోయాడు. తనను పారిపొమ్మని బావిలోనుంచే తన తమ్ముడు అరిచాడని మోహన్ వెల్లడించాడు. మంగళవారం మృతదేహం పైకి తేలడంతో పోలీసులు బయటకు తీయించి పంచనామా నిర్వహించారు. మృతుడికి భార్య మంజుల, రెండేళ్ల బాబు ఉన్నాడు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రంజిత్ తెలిపారు.

వాయు కాలుష్యాన్ని నివారించాలని ధర్నా

- రెండు గంటల పాటు ధర్నా చేపట్టిన గ్రామస్తులు
- పరిశ్రమలకు కార్మికులను వెళ్లనీయకుండా అడ్డగింత



ధర్నా చేస్తున్న ప్రజలు, నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): గడ్డపోతారం పారిశ్రామిక వాడలోని పలు పరిశ్రమల నుంచి రాత్రి వేళల్లో భారీగా వ్యర్థ ఘాటు వాసనలు వెలువడుతోందని మంగళవారం గ్రామస్తులు పరిశ్రమలకు వెళ్లే ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. రెండు గంటల పాటు ధర్నా చేపట్టడంతో పరిశ్రమలకు వెళ్లే వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ నెల రోజుల నుంచి భారీ స్థాయిలో రాత్రి సమయంలో పరిశ్రమల నుంచి వ్యర్థ ఘాటు వాసనలు వెలువడుతున్నాయన్నారు. ఈ సమస్యను పీసీబీ అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవటం లేదన్నారు. కాలుష్యాన్ని నమోదు చేసే పరికరాలు కూడా సక్రమంగా పనిచేయటం లేదన్నారు. వాయు కాలుష్యాన్నినివారించేలా అధికారులు, పరిశ్రమల యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చర్యలు తీసుకుంటామని పీసీబీ అధికారులు హామీ ఇవ్వటంతో ఆందోళనలను విరమించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు జానాబాయి, నాయకులు అశోక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

పటాన్‌చెరు టౌన్: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన భానూర్-బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ మహేశ్వర్ రెడ్డి కథనం ప్రకారం... మండల పరిధిలోని కర్ధనూర్ గ్రామ శివారులోని ఐచర్ కంపెనీ సమీపంలో పిచ్చిమొక్కలు ఉన్న స్థలంలో ఓ వ్యక్తి మృతదేహం ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు ఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించగా మృతుడి ఎడమ వైపు చాతిపై అమరావతి అని, కుడి చేతిపై మధు, మేఘన అని పచ్చబొట్టు కనిపించింది. దీంతో మృతదేహంను పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మృతుడికి సంబంధించిన బంధువులు ఉంటే బీడీఎల్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

లింగాయత్ మహార్యాలీ పోస్టర్ విడుదల



పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్

జహీరాబాద్ టౌన్: తెలంగాణ లింగాయత్ సమన్వయ సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జూన్ 4న నిర్వహించతల పెట్టిన మహార్యాలీ పోస్టర్‌ను ఆర్టీసీ ఎండీ సజ్జనార్ మంగళవారం ఆవిష్కరించారని రాష్ట్రీయ బసవదళ్ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ పాటిల్ తెలిపారు. లింగాయత్‌లను ప్రత్యేక ధర్మంగా గుర్తించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామని, ఈ మేరకు పలు రాష్ట్రాల్లో ర్యాలీలు సభలు, సమావేశాలను నిర్వహించామన్నారు. హైదరాబాద్‌లో నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించతల పెట్టిన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జహీరాబాద్ రాష్ట్రీయ బసవదళ్ నాయకులు యశ్వత్ పాటిల్, లింగాయత్ సమాజ్ నాయకులు పాల్గొన్నారు.

అందరికీ నెగెటివ్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం 15 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించారు. అందులో అందరికీ నెగెటివ్ వచ్చిందని నిర్వాహకులు మనోహర్ తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి ఆత్మహత్య

తాగిన మైకంలో...

న్యాల్‌కల్(జహీరాబాద్): తాగిన మైకంలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండల పరిధిలోని మొల్కన్ పాడు గ్రామ శివారులో చోటు చేసుకుంది. హద్నూర్ ఎస్‌ఐ వినయ్‌కుమార్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పట్లోళ్ల శ్రీనివాస్‌రెడ్డి(35) వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 29వ తేదీన బయటకు వెళ్లి వస్తానంటూ భార్య నాగమణికి చెప్పి వెళ్లాడు. మధ్యాహ్నం 12 గంటలకు గంగ్వార్ వద్ద ఉన్నాను, వస్తానని భార్యకు ఫోన్లో చెప్పాడు. అనంతరం ఫోన్ స్విచ్‌ఆఫ్ అయ్యింది. మంగళవారం ఉదయం మృతుడి తండ్రి పొలానికి వెళ్తుండగా ఉరేసుకొని కనిపించడంతో బోరున విలపించాడు. శ్రీనివాస్‌రెడ్డి తాగిన మైకంలో ఆత్మహత్య చేసుకొని ఉంటాడన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వివరించారు.

ఆర్థిక సమస్యలతో..

మనోహరాబాద్(తూప్రాన్): ఆర్థిక సమస్యలతో మద్యానికి బానిసైన వ్యక్తి పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సందీప్‌రెడ్డి వివరాల ప్రకారం.. మెదక్ మండలం పేరూర్ గ్రామానికి చెందిన వాడి వెంకట్ రెడ్డి (52) రెండేళ్లుగా మేడ్చల్‌లో ఉంటూ ఆటో నడుపుకుంటు జీవనం సాగిస్తున్నాడు. ఆర్థిక సమస్యలు ఎక్కువై తాగుడుకు బానిసయ్యాడు. తాగుడుకు బానిసకావొద్దని భార్య మందలించింది. మనస్తాపం చెందిన వెంకట్‌రెడ్డి మంగళవారం కాళ్లకల్ శివారులో వైన్స్ వద్ద పురుగుల మందు తాగాడు. అనంతరం విషయాన్ని పెద్ద కొడుకు ఫోన్ చేసి చెప్పాడు. కుటుంబసభ్యులు అక్కడకు వెళ్లేసరికి మృతిచెంది ఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. మృతుడికి భార్య సబిత, ఇద్దరు కుమారులున్నారు.



వెంకట్‌రెడ్డి (ఫైల్)

సీసీ కెమెరాలతో నేరాలు అదుపు

సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత



మాట్లాడుతున్న సీపీ శ్వేత, అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్

సిద్దిపేటకమాన్: సీసీ కెమెరాలతో నేరాలు అదుపులోకి వస్తున్నాయని సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత అన్నారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సిబ్బందికి సీసీ కెమెరాల పర్యవేక్షణ, ఇన్‌పుట్, అవుట్‌పుట్, డీవీఆర్ తదితర అంశాల గురించి వాటి పనితీరు, పర్యవేక్షణ గురించి రెండు రోజుల వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ సీసీ కెమెరాల ద్వారా ప్రజల సెన్సాఫ్ సెక్యూరిటీ పెంచామన్నారు. నూతన టెక్నాలజీని ప్రతి ఒక్కరూ అందిపుచ్చుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న కోఆర్డినేటర్లు పట్టణాలు, గ్రామాల్లో ఉన్న సీసీ కెమెరాలను చెక్ చేసుకోవాలని తెలిపారు. సీసీ కెమెరాల గురించి ప్రతీరోజు సంబంధిత ప్రజా ప్రతినిధులతో, గ్రామ పంచాయతీ సిబ్బందితో సీసీ కెమెరాలు ఎలా పనిచేస్తున్నాయో మానిటర్ చేయాలన్నారు. సీసీ కెమెరాలతో కేసుల ఛేదనను ఛాలెంజ్‌గా తీసుకొని విధులు నిర్వహించాలన్నారు. క్రైమ్ రేటు తగ్గించడానికి సీసీ కెమెరాలు ముఖ్యపాత్ర వహిస్తాయన్నారు. సీసీ కెమెరాలు ఉన్న గ్రామాలలో నేరాలు తగ్గుముఖం పట్టాయన్నారు. ప్రతినెల సీసీ కెమెరాల కోఆర్డినేటర్ శిక్షణ ఇవ్వాలని జిల్లా సీసీ కెమెరాల కోఆర్డినేటర్ పరందాములుకు సూచించారు. సీసీ కెమెరాల పనితీరు, తదితర అంశాల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్, సీసీఆర్బీ ఏసీపీ చంద్రశేఖర్, ఎస్బీ సీఐ రఘుపతిరెడ్డి, జిల్లా సీసీ కెమెరాల కోఆర్డినేటర్ పరందాములు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్



పాలమాకులలో ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేస్తున్న ఏఓ, ఎస్‌ఐ

నంగునూరు(సిద్దిపేట): రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే పీడీఆక్ట్ నమోదుచేస్తామని రాజగోపాల్‌పేట ఎస్‌ఐ రాజుగౌడ్ అన్నారు. మంగళవారం వ్యవసాయ అధికారి గీతతో కలసి నంగునూరు, పాలమాకుల, రాంపూర్, సిద్దన్నపేట గ్రామాల్లో ఫెర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. సెంటర్‌లో స్టాక్, విత్తనాలు, రికార్డులను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఫెర్టిలైజర్ షాపులను తనిఖీ చేశామన్నారు. ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మినా, ఎక్కడైనా నిల్వ చేసినట్లు తెలిసినా సమాచారం అందించాలన్నారు. విత్తనాలు కొంటే ఖచ్చితంగా బిల్లులు తీసుకోవాలని రైతులకు వారు సూచించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. సదాశివపేట సీఐ నవీన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..మునిపల్లి మండలంలోని పెద్దలొడీ గ్రామానికి చెందిన బస్వరాజ్(36) వ్యవసాయ పనులను చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 27న బుదేరా నుంచి సదాశివపేట వైపు తన కారులో వస్తుండగా ఆరూర్ గ్రామ సమీపంలో వాటర్ ట్యాంకర్‌ను ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. స్పందించిన స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. సీఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ..

మునిపల్లి(అందోల్): రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. బుదేరా ఎస్‌ఐ రాజశేఖర్ కథనం ప్రకారం కోహీర్ మండలంలోని మాచిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన చారేటి కమలమ్మ తన భర్త లక్ష్మయ్యతో కలిసి ఈ నెల 25వ తేదీన సంగారెడ్డి ఎంఎన్ఆర్ ఆస్పత్రికి కంటి చికిత్స కోసం వెళ్లారు. తిరిగి 29వ తేదీ సాయంత్రం కంకోల్ చౌరస్తాలో బస్సు దిగి తాటిపల్లి వచ్చే క్రమంలో కమలమ్మ తప్పిపోయింది. దీంతో లక్ష్మయ్య తాటిపల్లిలో తన బంధువుల దగ్గర వెతికినా ఆచూకీ దొరకలేదు. మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి చెందినట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

మూర్ఛ వ్యాధితో యువకుడు..

దుబ్బాక: మూర్ఛ వ్యాధితో యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన రాయపోల్ మండల పరిధిలోని అనాజిపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. మంగళవారం రాయపోల్ ఎస్‌ఐ షేక్ మహబూబ్ తెలిపిన వివరాల ప్రకారం..మండల పరిధిలోని అనాజిపూర్ గ్రామానికి చెందిన వెంకని మధు (24)కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. 4 సంవత్సరాల నుంచి మధు మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నాడు. దీనికి తోడు మద్యానికి బానిసై రోజు మద్యం సేవించేవాడు. ఎప్పటిలాగే సోమవారం రాత్రి మద్యం సేవించి ఇంటికి ఆలస్యంగా వచ్చాడు. మద్యం తాగామని సోదరు మందలించడంతో ఆగ్రహంగా బయటకు వెళ్లిపోయాడు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు మధు ఆచూకీ కోసం గాలించగా, ఇంటి దగ్గర చెట్టు కింద పడి మృతిచెంది ఉన్నాడు. మృతుని తల్లి బాలమణి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తిపై కేసు నమోదు

సంగారెడ్డి మున్సిపాలిటీ: గుట్టుచప్పుడు కాకుండా కరెంటును వినియోగించుకున్నందుకు ఓ వ్యక్తిపై రెండవసారి కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు విజిలెన్స్ సీఐ రాంచేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా హత్నూర మండలంలోని బోర్పట్ల గ్రామంలో విజిలెన్స్-ఏపీటీఎస్ బృందం డీపీఈ/సంగారెడ్డి స్క్వాడ్‌తో కలిసి తనిఖీలు చేసి నిందితుడు డప్పో నర్సింహులును నేరుగా ట్యాప్ చేయడం ద్వారా తన గృహ అవసరాలకు విద్యుత్ సరఫరాను వినియోగిస్తున్నట్టు గుర్తించారు. ఇతనిపై గతంలో విద్యుత్ చట్టం 2003లోని క్రైమ్ నెంబర్ 4217/201/135 ప్రకారం కేసు నమోదైంది. మంగళవారం విజిలెన్స్ -ఏపీటీఎస్ సంగారెడ్డి సిబ్బంది నిందితుడిని అరెస్టు చేసి విద్యుత్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి సంగారెడ్డిలోని ఏడీ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు.

పంటను కాల్చినవారిపై ఫిర్యాదు

మద్దూరు(హుస్నాబాద్): గాగ్గిల్లాపూర్ గ్రామానికి చెందిన నారదాసు సిద్దిలింగం ఎకరంన్నర వరి పొలాన్ని దహనం చేసిన వ్యక్తులపై బాధితుడి కుమారులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల వివరాల ప్రకారం..బైరాన్‌పల్లికి చెందిన సిద్దిలింగంకు గ్రామ శివారులో వరి పొలం ఉంది. దీంతో సిద్దిలింగం కుమారులు యాసంగి వరి పంటను సాగుచేశారు. సిద్దిలింగం సమీప బంధువైన నారదాసు పోచయ్యకు సిద్దిలింగం కుమారుల మధ్య కొంతకాలంగా భూ సమస్యలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కోతకు వచ్చిన ఎకరంన్నర వరిపొలం, 120మీటర్లు ప్లాస్టిక్ పైపులు, విద్యుత్ సర్వీస్ వైర్లు, కేసింగ్ పైపులు దహనం అయ్యాయి. రూ.2లక్షల వరకు నష్టం వాటిల్లింది. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ నారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కన్‌సాన్‌పల్లి జిన్నింగ్‌మిల్‌లో అగ్ని ప్రమాదం



జిన్నింగ్ మిల్‌లో కాలిపోయిన పత్తి

జోగిపేట(అందోల్): అందోల్ మండలం కన్‌సాన్‌పల్లి శివారులోని సిద్దార్థ జిన్నింగ్ మిల్‌లో సోమవారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. భారీ ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు. అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో వెంటనే ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పారు. అప్పటికే మిల్‌లో ఉన్న పత్తి కాలి బూడిదయ్యింది. సుమారుగా రూ.4 లక్షలు నష్టం జరిగినట్లుగా ఫైర్ సిబ్బంది నివేదిక ఇచ్చినట్లు సమాచారం. జిన్నింగ్ మిల్‌లో అగ్నిప్రమాదంపై తమకు సమాచారం లేదని జోగిపేట ఎస్‌ఐ సామ్యానాయక్ తెలిపారు.

పేలిన సిలిండర్

- రెండు ఇండ్లు దగ్ధం
- రూ.15 లక్షలపైగా నష్టం
- నిజాంపేట్‌లో ఘటన



కాలిపోయిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

నారాయణఖేడ్: ప్రమాదవశాత్తు వంటగ్యాస్ సిలిండర్ పేలి రెండు ఇళ్లు కాలిపోయిన సంఘటన నారాయణఖేడ్ నియోజకవర్గంలోని నిజాంపేట మండల కేంద్రంలో మంగళవారం జరిగింది. బాధితులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పుట్టి లచ్చవ్వ, పుట్టి పోచవ్వ కుటుంబాలు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గ్రామంలో నూతనంగా దుర్గా భవానీ ఆలయాన్ని నిర్మించారు. బుధవారం ఆలయం ప్రారంభోత్సవం జరగనుంది. పుట్టి లచ్చవ్వ, పుట్టి పోచవ్వ కుటుంబాలు ఆలయానికి పూజారులుగా వ్యవహరిస్తుండడంతో ఉదయం 6 గంటలకు ఇంట్లో పనులు పూర్తి చేసుకొని కుటుంబ సభ్యులు అందరూ ఆలయానికి వెళ్లారు. 7 గంటల సమయంలో పుట్టి లచ్చవ్వ ఇంట్లోని గ్యాస్ సిలిండర్ పేలి మంటలు రేగాయి, ఈ మంటలు పక్కనే ఉన్న పుట్టి పోచవ్వ ఇంటికి సైతం అంటుకొన్నాయి. ఇంట్లో నిద్రిస్తూ మంటలు వ్యాప్తిని చూసిన పుట్టి పోచవ్వ కుమారుడు పుట్టి లింగం బయటకు పరుగున వచ్చి ఆరుస్తూ స్థానికులు, కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చాడు. అప్పుడే మిషన్ భగీరథ నల్లా వస్తుండడంతో ఆ నీటితో మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అనంతరం అగ్నిమాపక శకటం వచ్చి మంటలను అదుపులోకి తెచ్చింది. ఈ ప్రమాదంలో రెండు పెంకుటిళ్లు పూర్తిగా కాలిపోయాయి. ఇంట్లోని ధాన్యం, బియ్యం, పప్పులు, బట్టలు, నగదు, సామగ్రి కాలి బూడిదయ్యాయి. పుట్టి లింగం పదోతరగతి సర్టిఫికెట్లు కాలిపోయాయి. రూ.15 లక్షలకు పైగా ఆస్తి నష్టం సంభవించింది. ఇరు కుటుంబాల రోదనలతో మిన్నంటాయి. విషయం తెలుసుకున్న సర్పంచ్ జగదీశ్వరాచారి హుటాహుటిన ఘటనా స్థలానికి వెళ్ళి సహాయక చర్యలు చేపట్టారు. బాధితులకు తాత్కాలికంగా రూ.2 వేల ఆర్థిక సహాయం అందించారు. తహసీల్దార్ మదన్ ఘటనా స్థలాన్ని పరిశీలించి బాధిత కుటుంబాలకు బియ్యం, రూ.వేయి చొప్పున నగదు అందజేశారు. తాలూకా కురుమ సంఘం ఉపాధ్యక్షుడు మల్గొండ బాధితులను పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. ఇరు కుటుంబాలకు వ్యవసాయ కూలీ జీవనాధారం. ఈ కుటుంబాలను ఆదుకోవాలని గ్రామస్తులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.